

వేంకటేశ్వర స్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

వైభవంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం

కేశంపేట, మార్చి 1: మండల కేంద్రంలోని దవళగిరి గుట్టపై వెలసిన అలువేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదట స్వామివారి అలయం నుంచి ఆంజనేయ స్వామి దేవాలయం వరకు భక్తులు రథాన్ని లాగారు. అనంతరం హనుమాన్ ఆలయం నుంచి తిరిగి స్వామి వారి ఆలయం వరకు రథాన్ని తీసుకువచ్చారు. రథాన్ని లాగుతున్న సమయంలో వేంకటేశ్వర స్వామి నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. గ్రామ పురవీధుల గుండా రథోత్సవం కొనసాగింది. రథాన్ని లాగడానికి భక్తులు పెద్దఎత్తున పోటీ పడ్డారు. రథోత్సవంలో తాజా మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, యాదయ్య చారి, సజ్జల విశ్వానాథం, యెన్నం శ్రీధర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజు, శివాజీ, పాండురంగారెడ్డి, నారాయణరెడ్డి, మఠం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



భూమికి పచ్చని రంగేసినట్టు!

యాచారం మండలంలోని చౌదర్‌పల్లి-చిన్నతూండ్ల గ్రామాల మధ్య విత్తనాల కోసం ఓ రైతు రహదారి పక్కన రెండు ఎకరాలలో పొద్దు తిరుగుడు పంటను సాగు చేశాడు. అది ప్రస్తుతం ఏపుగా పెరిగి పొద్దు తిరుగుడు పూలు అందంగా కనిపిస్తున్నాయి. పచ్చని పూలు గాలికి ఊగుతూ దారి వెంట వెళ్లే బాటసారులకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ఎంతో ఆహ్లాదకరంగా కను విందు చేస్తున్న ఆ సుందర మనోహర దృశ్యాన్ని ఆ రోడ్డు వెంట వెళ్లే ప్రతీ ఒక్కరూ తనివి తీరా చూసి ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

- యాచారం, మార్చి 1

నిండు జీవితానికి రెండు చుక్కలు!



- రేపే పల్స్‌పోలియో
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మొదటి రోజు డ్రాప్స్ వేయించుకోని పిల్లలకు సోమ, మంగళవారం వేసేలా చర్యలు
- జిల్లాలో 4,09,308మందికి పోలియో చుక్కలు వేయాలని లక్ష్యం



పల్స్‌పోలియో చుక్కల పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ శశాంక, అధికారులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 1 : పల్స్‌పోలియో కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రారంభం కానుంది. జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 4,09,308 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని వారి కోసం సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయనున్నారు. ఇళ్లను సందర్శించి ప్రతీ ఇంటికి సీరియల్ నెంబర్లు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి ఆధ్వర్యంలో 681 మంది వైద్య సిబ్బందికి 11 మంది అధికారులకు, 1,600 మంది అంగన్‌వాడీ టీచర్లు, 1,385 మంది ఆశా కార్యకర్తలకు, నర్సింగ్ కాలేజీలోని 604 మంది విద్యార్థులకు పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు.

పోలియో చుక్కల వివరాలు

0-5 ఏళ్లలోపు పిల్లలు : 4,09,308
పోలియో కేంద్రాలు : 624
మొబైల్ టీంలు : 55, ట్రాన్సిట్ పాయింట్లు : 55
సమాచార విస్తరణకు వాహనాలు : 55
పోలియో చుక్కలు వేసేది : మార్చి 3, ఆదివారం

ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించండి : కలెక్టర్

ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆయన పోలియో చుక్కల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 3 (ఆదివారం) పోలియో చుక్కలను 0-5 సంవత్సరాల పిల్లలకు వేయించాలని సూచించారు. ఆ రోజు పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలకు మరుసటి రోజు వేయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, జిల్లా ఇనైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి, సంబంధిత డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ విమానాశ్రయంలో హై అలర్ట్

- బెంగళూరు ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు నేపథ్యంలో సీఐఎస్ఎఫ్, ఎయిర్‌పోర్ట్ ఇంటలిజెన్స్ సిబ్బంది అప్రమత్తం

శంషాబాద్ రూరల్, మార్చి 1 : బెంగళూరు ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు నేపథ్యంలో శుక్రవారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. ఈమేరకు విమానాశ్రయంలో బాంబ్ స్క్వాడ్‌తో పోలీస్ అధికారులు తనిఖీలు చేపట్టారు. విమానాశ్రయానికి వచ్చే ప్రయాణీకులందరినీ, లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన పిదపనే లోనికి అనుమతించారు. విమానాశ్రయం నుంచి బయటకు వెళ్లేవారిని కూడా పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపుతున్నారు. అనుమానితులను మెటల్ డిటెక్టర్లతో పలు మార్లు తనిఖీ చేస్తున్నారు. విమానాశ్రయ అధికారులు మైక్‌లో అనౌన్స్ చేయడంతో ప్రయాణీకులు కూడా సహకరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



రోగులకు ఆరోగ్యాన్ని అందించే ఆసుపత్రులే సమస్యల రోగాల్లో కూరుకుపోయాయి. అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లిన వారికి అక్కడ సమస్యలే ఎదురవుతున్నాయి. డాక్టర్ల కొరత మొదలు, పరికరాల లేమి వరకు అసౌకర్యాలే రాజ్యమేలుతున్నాయి. ఇబ్రహీంపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రంపై అధికారులు శీతకన్ను పెట్టడంతో ఇక్కడ రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. ఈ ఆసుపత్రిని వైద్యవిధాన పరిషత్‌లో చేర్చినా ఫలితం కనిపించడం లేదు. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పట్నం సీహెచ్‌సీకి సమస్యల రోగం!

సరిపడా వైద్యులు లేక సేవలు అంతంతే..

- ముగ్గురు డాక్టర్లతో నెట్టుకొస్తున్న వైనం
- అధ్వానంగా సౌకర్యాలు.. రోగుల ఇబ్బందులు
- వైద్యవిధాన పరిషత్ పరిధిలోకి వచ్చినా ప్రయోజనం శూన్యం!

ఇబ్రహీంపట్నం, మార్చి 1: ఇబ్రహీంపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో సరిపడా వైద్యులు, సిబ్బంది లేక రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. దాంతో రోగులకు వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ఈ ఆసుపత్రిని వైద్యారోగ్య శాఖ పరిధి నుంచి 2021లో తెలంగాణ వైద్యవిధాన పరిషత్(టీవీవీపీ) పరిధిలోకి మార్చినప్పటికీ ఇప్పటివరకూ పూర్తిస్థాయిలో క్యాడర్ స్ట్రెంత్‌కు మంజూరీ ఇవ్వలేదు. పైగా వైద్యశాఖలో ఇటీవలే ప్రభుత్వం డిప్యుటేషన్ల కూడా రద్దు చేయడంతో ఉన్న వారిలో ఇద్దరు డాక్టర్లు, నర్సులు స్వస్థలాలకు వెళ్లిపోయారు. కాగా, 30 పడకల ఆసుపత్రి అయినప్పటికీ ఓపీ(ఔట్ పేషంట్) ఎక్కువగా ఉంటుంది. మెడికోలీగల్, పీఎంతః కూడా ఇక్కడ ఎక్కువే. కనీసం పది మంది వైద్యులు ఉండాల్సిన చోట ముగ్గురే ఉన్నారు. ఆరు నెలలుగా గైనకాలజిస్టు, ఏడాదికాలంగా అనస్థీసియా స్పెషలిస్టులు లేరంటేనే ఏ మేరకు సేవలు అందుతున్నాయో తెలుస్తోంది. నర్సింగ్, పారిశుధ్య సిబ్బంది కనీసం 30 మంది వరకు ఉండాలి. కానీ, సగం సిబ్బంది కూడా లేకుండా నెట్టుకొస్తున్నారు. టాయిలెట్లు అధ్వానంగా ఉన్నాయి. రోగులు, సిబ్బంది ఒకే టాయిలెట్‌ను వాడుకోవాల్సిన పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో.. ఏడాది క్రితం ఈ సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు జీవో కూడా విడుదల చేసింది. కొత్తగా భవనాల కోసం రూ.37.50 కోట్లు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కూడా ఇచ్చారు. కాగా, ఇప్పుడు ఉన్న భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ భవన నిర్మాణం కోసం ఏడాది క్రితం రామోజీ ఫౌండేషన్ రూ.4కోట్లు విరాళం కూడా ప్రకటించి భవనాన్ని నిర్మించి ఇచ్చేందుకు ముందుకు వచ్చినా అప్పటి ప్రభుత్వం తాత్సారం చేస్తూ వచ్చింది.

తాగునీటి కటకట.. ల్యాబ్ సౌకర్యమూ లేదాయే..

సీహెచ్‌సీలో తాగునీటి సౌకర్యమూ సరిగాలేదు. ఆరు నెలలుగా ఇక్కడ డయాలసిస్ సెంటర్ కూడా నడుస్తోంది. ప్రతీరోజు 10మంది రోగులకు రెండు షిఫ్టుల్లో డయాలసిస్ చేస్తున్నారు. ప్యూరిఫై చేసిన నీటినే డయాలసిస్ పేషెంట్‌కు అందించాలి. ఒక్క డయాలసిస్ పేషెంట్‌కు 750 లీటర్ల నీరు అవసరమవుతుంది. ఉన్న ఒక్క బోరు బావి నీటిమట్టం కూడా పడిపోయింది. మున్సిపల్ నల్లా కనెక్షన్లు ఉన్నా.. నీరు ఏ మాత్రం సరిపోవడం లేదు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా.. అది వచ్చే వరకు ఎదురుచూడాల్సిందే. అంతేగాకుండా ల్యాబ్ సౌకర్యం లేకపోవడంతో డయాలసిస్ రోగులు ప్రైవేటుగా పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుంది.



డయాలసిస్ సెంటర్లో రోగులు



ఊడిపోయిన టాయిలెట్ డోర్



టాయిలెట్ల పరిస్థితి ఇలా

మరిచిపోలేని ఘటన

కుటుంబ నియంత్రణ శిబిరంలో భాగంగా ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో శస్త్ర చికిత్స చేయగా.. లోపం కారణంగా నలుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇప్పటికీ ఆసుపత్రిని నీడలా వెంటాడుతూనే ఉంది. 2022 ఆగస్టులో 34మంది మహిళలు కుటుంబ నియంత్రణ చికిత్సలు చేయించుకోగా.. ఒక్కసారిగా మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అందులో నలుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయిన ఘటన అప్పట్లో రాష్ట్రంలోనే సంచలనంగా మారింది. అప్పట్లో ఈ సీహెచ్‌సీకి యాచారం, మంచాల, సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్, మాడ్గుల తదితర ప్రాంతాల నుంచి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స కొరకు చాలా మంది వచ్చేవారు. ఆ ఘటన తర్వాత ఇక్కడ శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. దాంతో మహిళలు వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి, కోఠి, మలక్‌పేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు.

నీటి వసతి లేక రోజూ తిప్పలే



ఆసుపత్రిలో సరైన నీటి వసతి లేకకపోవడంతో ఇబ్బందిగా ఉంది. నిత్యం డయాలిస్ రోగులకు ఫిల్టర్ చేసిన నీటిని మాత్రమే అందించాల్సి ఉంటుంది. మున్సిపల్ ట్యాంకర్ ఎప్పుడు వస్తుందా! అని ఎదురు చూడడటమే దిక్కు. ముఖ్యంగా డయాలసిస్ పేషంట్లకు ల్యాబ్ సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటుగా పరీక్షలు చేయించుకుంటున్నారు.

- బి.రమేష్, డయాలసిస్ సెంటర్ అసిస్టెంట్

సేవలను మెరుగుపరచాలి



30 పడకల సీహెచ్‌సీలో సరైన సౌకర్యాలు లేవంటే ఏమనుకోవాలి. వైద్యులు, సిబ్బంది కూడా సరిపడా లేకపోవడంతో చాలామంది ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి. 24 గంటలూ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి.

- ఇటికాల హైమావతి, ముకునూరు

స్ట్రెంత్ క్యాడర్‌ను మంజూరు చేయాలి

ఆసుపత్రికి తగినంత స్ట్రెంత్ క్యాడర్‌ను మంజూరు చేయాలి. వైద్యులు, సిబ్బంది తగినంత లేకపోయినా ఉన్నంతలో మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లాం. రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

- డా.రఘునాథ్, సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్



శిథిలమైన భవనంలో గోడలకు పగుళ్లు

అవినీతి అధికారులను ఏసీబీకి పట్టిస్తే నజరానా

- కేఎల్లార్ ట్రస్టు ద్వారా లక్ష రూపాయలు
- మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం, మార్చి 1 : అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించిన వారికి రూ.లక్ష నజరానా అందజేస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. శుక్రవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, విద్యుత్ అధికారులు అడ్డూ అదుపు లేకుండా అవినీతికి పాల్పడుతున్నారని ప్రజలు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. అవినీతి అధికారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించదన్నారు. పదేళ్లుగా ప్రజలను పట్టి పీడించిన అవినీతి అధికారులకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన రీతిలో బుద్ధి చెబుతుందని, ఇప్పటికైనా అలాంటి అధికారులు తమ పద్ధతి మార్చుకోవాలని, పని మీద కార్యాలయాలకు వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. అలా కాకుండా అది లేదు.. ఇది లేదంటూ అనవసర కారణాలతో లంచాలు గుంజాలని చూస్తే ఉద్యోగాలు ఊడడంతో పాటు జైలుశిక్ష తప్పదని కేఎల్లార్ అన్నారు. అవినీతి అధికారులను పట్టిస్తే రూ.లక్ష నజరానా ప్రకటనతో వివిధ శాఖల అధికారుల్లో తీవ్ర భయాందోళన మొదలైంది.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 1 : ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఇంటర్ ఫస్టియర్‌లో 76,231 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 74,616 మంది హాజరయ్యారు. 1,615 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. విద్యాశాఖ అధికారులు పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కూ తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షా కేంద్రాల్లో అధికారులు విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంచారు. సమీపంలోని జీరాక్స్ కేంద్రాలను మూసివేయించారు.

పొరపాట్లు లేకుండా పరీక్షలు నిర్వహించాలి : కలెక్టర్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కొనసాగుతున్న పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శశాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని తరగతి గదులలో తిరుగుతూ పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా గమనించారు. విద్యార్థులకు కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా తగిన మౌలిక సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్ ఆరా తీశారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్‌కు కలెక్టర్ సూచించారు. క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పోలీసు సిబ్బంది విధుల్లో ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా మెడిసిన్ అందుబాటులో ఉంచాలని కలెక్టర్ శశాంక సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధనలు అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని ఆయన అధికారులను ఆదేశించారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ శశాంక



ఇంటర్ ఇంగ్లీష్ పరీక్షకు 317 మంది గైర్హాజరు

వికారాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు జిల్లాలో 317మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం నిర్వహించిన పరీక్షకు 8565 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 8248మంది హాజరయ్యారు. 317మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 6872మంది విద్యార్థులకు 6655 మంది హాజరు కాగా, 217మంది హాజరు కాలేదు. ఒకేషనల్ విభాగంలో 1693మంది విద్యార్థులకు 1593 మంది హాజరు కాగా 100 మంది గైర్హాజరయ్యారు.

కులకచర్ల: మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష జరిగింది. రామలింగేశ్వర కళాశాలలో 285 మంది విద్యార్థులకు గాను 16 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ కామేశ్వరి తెలిపారు.

వేసవిలో ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

మోమిన్‌పేట్, మార్చి 1: వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధిహామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలని డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెల్చాల్ గ్రామంలో శుక్రవారం జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీలో పని చేసే కూలీలకు రూ.272 పొందాలంటే నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. కూలీలు నష్టపోకుండా ప్రతీ ఒక్కరికి ప్రతీవారం డబ్బులు అందించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం నీరు పోయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శంకరయ్య, ఏపీయం రాజు, ఈసీ వికాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్‌లు గంగయ్య, వెంకటేశం, రాములు, ఎల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ హన్మంతు, కూలీలు పాల్గొన్నారు.

'ధరణి' సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలి




రెడ్డిఘణాపూర్‌లో ధరణి సమస్యలపై దరఖాస్తు తీసుకుంటున్న అధికారులు

బషీరాబాద్, మార్చి 1: ధరణి సమస్యలు ఎమైనా ఉంటే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని బషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటయ్య సూచించారు. రెడ్డిఘణాపూర్‌లో శుక్రవారం ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీటీ అక్కడికి వచ్చిన రైతులకు ధరణి సమస్యలకు సంబంధించి ఏఏ అంశాలపై దరఖాస్తు చేసుకోవాలనేదానిపై వివరించారు. పలు సమస్యలపై దరఖాస్తులు రాగా అధికారులు స్వీకరించారు. త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, సర్వేయర్ ప్రభు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

కులకచర్ల, మార్చి 1: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులు వాజిహుద్దీన్, మాధురి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం వైద్య సిబ్బంది, ఆశావర్కర్‌లు, అంగన్‌వాడీ టీచర్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 4, 5 తేదీల్లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

తాండూరు రూరల్/పరిగి: పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రవీంద్ర యాదవ్ కోరారు. తాండూరులో మొత్తం 41,979 మంది పిల్లలు ఉన్నారని తెలిపారు. పరిగిలో 6434 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నట వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

















కేసీఆర్ పాలనలో ఉమ్మడి జిల్లా అధోగతి పాలు

- సాగునీటి ప్రాజెక్టుల్లో తీరని అన్యాయం
- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


పరిగి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ సునీత, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పరిగి, మార్చి 1 : కేసీఆర్ పదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాను అధోగతి పాలు చేశారని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం పరిగిలోని ఆయన నివాసంలో జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే 43 శాతం జనాభా ఉందని, రాష్ట్రానికే గుండెకాయలాంటి ఉమ్మడి జిల్లాకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఇక్కడ వచ్చే ఆదాయంతో ఉత్తర తెలంగాణలో ప్రాజెక్టులు కట్టారని, అభివృద్ధి పనులు చేశారని ఆరోపించారు. ఆదాయ వనరుగా ఉన్న జిల్లాను ఏడారిగా మార్చారని అన్నారు. గతంతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పాలమూరు-రంగారెడ్డి, చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టుల ద్వారా జిల్లాను సశ్యశ్యామం చేసేందుకు రూపకల్పన చేసి పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో డిజైన్లు మార్చేశారని, చేవెళ్ల-ప్రాణహితను మెదక్ జిల్లాకు మళ్లించారని, పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్ట్ ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. మేడిగడ్డ, ఇతర ప్రాజెక్టులు కూలిపోతున్నాయని, దీనికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రూ.7లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కేపీ లక్ష్మీదేవిపల్లి వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ నిర్మించి పరిగికి సాగునీరు తెస్తామని తెలిపారు. పరిగికి రైల్వేలైను నిర్మాణానికి రూ.3100 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఆరుగ్యారంటీ పథకాలు చేస్తామని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, రూ.10లక్షల వరకు ఆరోగ్యశ్రీ సేవలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలు అమలుచేసినట్లు తెలిపారు. ఉచిత విద్యుత్‌కు 98 శాతం మంది అర్హులుగా ఉన్నారని, దశలవారీగా మిగతా గ్యారంటీలను అమలు చేయడం జరుగుందన్నారు. గ్రామాల్లో త్వరలోనే ఐదుగురి సభ్యులతో ఇందిరమ్మ కమిటీలు వేసి ప్రభుత్వ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఇమడలేకనే కాంగ్రెస్‌లో చేరామని తెలిపారు. బీఆర్ఎస్‌లో కార్యకర్తలకు కనీస మర్యాద లేదని, నియంతపాలన కొనసాగిందని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉంటుందని, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ద్వారా జిల్లాకు సాగునీరు అందిస్తామని తెలిపారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కొరకు సాధించుకున్న రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సాధించింది శూన్యమని విమర్శించారు. గడీలపాలన పోయిందని, ప్రజాపాలన వచ్చిందని తెలిపారు. కాళేశ్వరం, మేడిగడ్డల పేరుతో రూ.వేల కోట్లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. తప్పులను ఒప్పుకోవాల్సిందిపోయి బీఆర్ఎస్ నేతలు నీతులు మాట్లాడతారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను పాలమూరు నుంచి పార్లమెంట్‌కు పంపిస్తే జిల్లాకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో జిల్లాను సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం బ్లాక్ వన్, టు అధ్యక్షులు సిద్ధాంతి పార్థసారధి, భరత్, డీసీసీ ఉపాధ్యక్షుడు బి.భీంరెడ్డి, కార్యదర్శులు రఘువీరారెడ్డి, కె.హన్మంత్, పట్టణాధ్యక్షుడు ఇ.కృష్ణ, కులకచర్ల ప్యాక్స్ చైర్మన్ మొగులయ్య, కొమిరె రాంచంద్రయ్య, పాలాది శ్రీనివాస్, జె.అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దగాపడ్డ దక్షిణ తెలంగాణ : వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ : పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దక్షిణ తెలంగాణను దగా చేశారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ధ్వజమెత్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తానని హామీ ఇచ్చి.. ఎంపీగా గెలుపొందిన తర్వాత పాలమూరు ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని కేసీఆర్‌పై మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం పనులు 80 శాతం పూర్తయ్యాయన్న బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలతో.. శుక్రవారం 'చలో పాలమూరు' నినాదంతో ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన తరలివెళ్లారు. అంతకుముందు షాద్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వీర్లపల్లి మాట్లాడుతూ కేసీఆర్ దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చి, ఉత్తర తెలంగాణ అభివృద్ధిపైనే దృష్టి సారించారని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను కేసీఆర్ తన కుటుంబానికి తాకట్టుపెట్టి ప్రజల బతుకులను దుర్భరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్ బాటలోనే మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కూడా మాజీ సీఎం కేసీఆర్ బాటలోనే నడిచారని శంకర్ విమర్శించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం గురించి ఎప్పుడూ పట్టించుకోలేదన్నారు. గతంలో ఎమ్మెల్యే హోదాలో ఉన్న అంజయ్య యాదవ్ రిజర్వాయర్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఉంటే పనులు ప్రారంభమై సాగు, తాగునీటి కష్టాలు తీరేవన్నారు. అభివృద్ధి పనులపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి భయాందోళనకు గురిచేశారని ఆరోపించారు. మిషన్‌భగీరథ పథకంపై అసెంబ్లీలో ప్రస్తావించానని, త్వరలోనే ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించనున్నారని వీర్లపల్లి తెలిపారు.


పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సందర్శనకు నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

'డీఎల్'గా బీట్ ఆఫీసర్

- డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి అటవీ అధికారి ఎంపిక
- గ్రూప్-4 ఫలితాల్లోనూ అర్హత


సీహెచ్ నరేష్

ధారూరు, మార్చి 1: ధారూరు అటవీ రేంజ్‌లో బీట్ అధికారిగా పనిచేస్తున్న సీహెచ్ నరేష్.. ఇటీవల తెలంగాణ గురుకుల బోర్డు నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించి గురుకుల డిగ్రీ లెక్చరర్(డీఎల్) ఉద్యోగానికి ఎంపికయ్యారు. గ్రూప్-4 పరీక్ష ఫలితాల్లోనూ మెరిట్ సాధించారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం రావులపల్లికి చెందిన నరేష్ ఎమ్మెస్సీ(మ్యాథ్స్) విద్యార్హతతో జూలై 2019లో అటవీ బీట్ అధికారిగా ఉద్యోగం సంపాదించి ధారూరు రేంజ్‌లో పోస్టింగ్ పొందారు. గతేడాది ఆగస్టులో తెలంగాణ గురుకుల బోర్డు నిర్వహించిన.. డిగ్రీ లెక్చరర్(డీఎల్) పరీక్ష రాసి అర్హత సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈనెల 4న సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఆయన ఉద్యోగ నియామకపత్రం అందుకోనున్నారు. డీఎల్ ఉద్యోగానికి ఎంపికవడం సంతోషంగా ఉందని బీట్ అధికారి నరేష్ తెలిపారు. గ్రూప్-4 ఉద్యోగం కూడా వచ్చే అవకాశాలున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధారూరు డీఎఫ్ఆర్వో జగన్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాజేందర్‌రెడ్డి, బీట్ ఆఫీసర్ ఆనంద్, అటవీ సిబ్బంది, తదితరులు నరేష్‌కు అభినందనలు తెలిపారు.

ఇంటిపన్ను వందశాతం వసూలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీవో సాధన

కందుకూరు, మార్చి 1 : 2023-24 సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని డీఎల్పీవో సాధన పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో సరితతో కలిసి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో జీపీడీపీ, ఉపాధిహామీ పనులు, నర్సరీల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీవో సునీల్, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

అక్రమ మైనింగ్ నిర్వాహకులపై చర్యలు


అంకిరెడ్డిపల్లిలో మైనింగ్ నిర్వహిస్తున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అశోక్

కీసర, మార్చి1: అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని కీసర తహసీల్దార్ అశోక్ హెచ్చరించారు. మండల పరిధి అంకిరెడ్డిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 918, 887, 886లో అనుమతికి మించి మైనింగ్ నిర్వహిస్తున్న స్థలాన్ని శుక్రవారం తహసీల్దార్ అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ 35 ఫీట్ల అనుమతి పొంది, దాదాపు 100 ఫీట్ల వరకు డ్రిల్ వేసి అక్రమంగా మైనింగ్ నిర్వహించారని అశోక్ తెలిపారు. దీంతో పక్కన ఉన్న అంకిరెడ్డిపల్లి గ్రామానికి హాని జరిగే అవకాశం ఉంది. దీంతో పాటు మైనింగ్ నిర్వహిస్తున్న ప్రదేశం దాదాపు 324 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఉందని, స్థలానికి మేడ్చల్, మాల్కాజ్‌గిరి జిల్లా యాదాద్రి భువనగిరి జిల్లా, సరిహద్దు వివాదం కూడా ఉందని తెలిపారు. కావున స్థలంపై సమగ్ర విచారణ జరిపి, నివేదికను ఉన్నత అధికారులకు తెలియజేస్తామని తహసీల్దార్ అశోక్ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం

బషీరాబాద్, మార్చి 1: మండలంలోని కొర్విచెడ్‌ఘని గ్రామంలో తాగునీటి సమస్య తీరింది. వేసవి వేళ డైరెక్టు పంపింగ్ సిస్టం బోరు పనిచేయకపోవడంతో స్థానికులు నీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. విషయం తెలుసుకున్న ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ తాజామాజీ సర్పంచ్ రథోడ్ సునీతా, కార్యదర్శి రాజుతో మట్లాడి బోరు మరమ్మతులు చేయించారు. ఎంపీపీ చొరవతో కొత్తగా మోటర్, ఇతర సామగ్రి తెప్పించి శుక్రవారం బోరును వాడుకలోకి తీసుకువచ్చారు. దీంతో స్థానికంగా నీటి సమస్య తీరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పనులను ఎంపీపీ భర్త, పీఎసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, తాజామాజీ సర్పంచ్ రథోడ్‌సునీతా దగ్గరుండి పరిశీలించారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

ధారూరు, మార్చి 1: కుక్కింద ఉన్నత పాఠశాలలో శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని సాయి దంత కళాశాల వారు దంత వైద్యశిబిరం నిర్వహించారు. 240 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేసి చికిత్స చేశారు. తీవ్రమైన దంత సమస్యలున్న విద్యార్థులను గుర్తించి పూర్తిస్థాయి చికిత్స నిమిత్తం తమ దంత వైద్యశాలకు రావాలని సూచించారు. దంత వైద్యులు అబ్దుల్‌వాసే, డి.జగదీష్, సోనాలి, అనూష, శివప్రియ, ప్రత్యూష, పీఆర్‌వో రవీందర్, పాఠశాల హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధునిక సేద్యం లాభదాయకం

తలకొండపల్లి, మార్చి 1 : ఆధునిక పద్ధతులతో సేద్యం చేయడం రైతులకు అన్ని విధాల లాభదాయకమని తలకొండపల్లి మండల వ్యవసాయాధికారి రాజు అన్నారు. పంటల సాగులో రైతులు పెట్టుబడులు తగ్గించుకొని అధిక దిగుబడులు పొందే విధానంపై దృష్టి సారించాలని చెప్పారు. తలకొండపల్లి మండలంలోని పడకల్, వెల్జాల గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి వరి పంటను, గోదాముల్లో యూరియా నిల్వలను పరిశీలించారు. పడకల్, అంతారం, వెంకటాపూర్ గ్రామాల్లో వరి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణాధికారులు విజయ్, అనిత, శిరీషలతో పాటు బాలయ్య, మహేష్, రైతులున్నారు.


వరి పంటను పరిశీలిస్తున్న ఏవో రాజు

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి

- రాచకొండ షీటీం డీసీపీ ఉషా విశ్వనాథం


మాట్లాడుతున్న డీసీపీ ఉషా విశ్వనాథం

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 1 : అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని రాచకొండ షీటీం డీసీపీ ఉషావిశ్వనాథం తెలిపారు. అంకుషాపూర్ ప్రిన్స్‌టన్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(ఇబ్రహీంపట్నం)లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో డీసీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ దాడుల పట్ల తమను తాము రక్షించుకోవడానికి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు కెరీర్‌పై దృష్టి సారించాలని, ఫోన్ల వాడకం తగ్గించి పుస్తక పఠనం చేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని తెలిపారు. ప్రిన్సిపాళ్లు రాధిక, వెంకటేశ్వర్లు, రాచకొండ సెక్యూరిటీ ఫోరం కో-ఆర్డినేటర్లు అర్చన, నందిత, సావిత్రి, సభ్యులు రజిని, రాధిక, స్వర్ణ, నిఖత్, వైఎస్ ప్రిన్సిపాల్ సౌజన్య, అధ్యాపకులు వరలక్ష్మి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి


ర్యాలీలో పాల్గొన్న అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 1 : అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీన్ తెలిపారు. మండలంలోని అవుషాపూర్‌లో శనివారం ఓటుహక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 'నా ఓటు-నా దేశం కోసం' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరుల్గున్నారు.

గ్రామీణ విద్యార్థులకు 'కార్పొరేట్ విద్య' అందుబాటులో ఉండాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ భూపాల్

కందుకూరు, మార్చి 1 : కార్పొరేట్ స్థాయి విద్య గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని నోబుల్ స్కూల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మండల విద్యాధికారి టి.మనోహర్, హైకోర్టు సీనియర్ అడ్వకేట్లు వెంకటాచారి, బి.జగన్ మోహన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ బి.కొండల్‌రెడ్డి, తదితరులున్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దు : సీఐ


రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

వికారాబాద్, మార్చి 1: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ నాగరాజు తెలిపారు. వికారాబాద్ పోలీస్ స్టేషన్‌పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్స్ చెడుప్రవర్తనను మార్చుకొని సత్ప్రవర్తనతో నడుచుకోవాలన్నారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, కబ్జాలకు పాల్పడినా కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. చట్ట వ్యతిరేక పనులు చేస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

రౌడీ షీటర్స్ నేరాల సంబంధిత కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా తమ భవిష్యత్తు ను నాశనం చేసుకోవద్దని వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక, చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. రౌడీ షీటర్స్ ఎవరినైనా ఇబ్బంది పెట్టినట్లు ఫిర్యాదు అందితే చర్యలు తీవ్రంగా ఉంటాయని, రౌడీ షీటర్స్ కదలికలపైన పోలీస్ అధికారుల నిఘా ఉందనే విషయాన్నీ గుర్తించుకోవాలన్నారు. రాత్రి సమయం లో పెట్రో, బ్ల్యూ కోట్స్ పోలీస్ అధికారుల ద్వారా రౌడీ షీటర్స్ నివసించే ప్రాంతాలలో నిఘా పెట్టడం జరుగుతుందని అన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలి


కమిషనర్ వసంతకు వినతిపత్రం అందజేస్తున్న మజీద్ కమిటీ సభ్యులు

ఆమనగల్లు, మార్చి 1 : పట్టణంలోని వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని స్థానిక జామ మజీదు కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆ మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండి. మాసూమ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ లలిత, ఎస్సై బాల్‌రామ్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ వసంతకు వినతిపత్రాలు అందజేశారు. ఆమనగల్లు పట్టణంలో వక్ఫ్‌బోర్డుకు రూ.కోట్ల విలువ చేసే రెండెకరాల భూమి ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు అట్టి భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. గతంలో కూడా ఆక్రమించే ప్రయత్నం చేయగా అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేస్తే వాటిని తొలగించారని చెప్పారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల రక్షణ కోసం ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. వివిధ మజీద్ కమిటీల అధ్యక్షులు గౌస్‌మైనోద్దీన్, ఖాదర్ ఖాద్రీ, మాసూమ్, నాయకులు చోటేబేగ్, నూరోద్దీన్, రజాక్, జబ్బార్, నయీమ్, అఫ్జల్, చాంద్‌పాష, జలాల్, అజహర్, మజీద్, హమీద్, పాష, రాహూఫ్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా ధరణి సమస్యల పరిష్కారం

- మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి


భూసమస్యలపై స్పెషల్ డ్రైవ్‌ను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట, మార్చి 1 : పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హాజరై పరిశీలించి మాట్లాడారు. ఈనెల 1 నుంచి 10వ తేదీ వరకు పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ మాట్లాడుతూ శామీర్‌పేట మండలంలో పెండింగ్‌లో 1,756 ధరణి భూసమస్యల పరిష్కారానికి సంబంధించి దరఖాస్తులు ఉన్నట్లు తెలిపారు. మూడు టీంలను ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్ కింద భూ సమస్యలపై యుద్ధప్రాతిపదికన చర్యలను తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్లియర్ చేస్తున్నట్లు చెప్పారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అయ్యసాగర్ త్రిపురాంతకేశ్వర ఆలయం ముస్తాబు

- 6 నుంచి 12వ తేదీ వరకు కొనసాగనున్న జాతర
- ఏర్పాట్లు పూర్తి.. 8న శివపార్వతుల కల్యాణం


అయ్యసాగర్ శివాలయం

ఆమనగల్లు, మార్చి 1: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దర్శనీయ స్థలంగా వెలుగొందుతున్న మండలంలోని రాంనుంతల గ్రామ సమీపంలో గల అయ్యసాగర క్షేత్రంలో వెలసిన శ్రీ త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి, భద్రకాళి, సరస్వతి, శ్రీరామాంజనేయ దేవాలయాలు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాయి. ఈనెల 6నుంచి 12వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని శోభాయామానంగా అలంకరించారు. శివకోటి జపయజ్ఞం, 26వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల కోసం ఆలయం వద్ద భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మేడ్చల్ తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివకోటి జపయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేసవి ప్రారంభం నేపథ్యంలో భక్తుల కోసం ఆలయ ఆవరణలో చలువ పందిర్లు, వసతి ఏర్పాట్లు గావించారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

బ్రహ్మోత్సవాల వివరాలను నిర్వాహకులు కర్నాకర్‌రెడ్డి, ఆలయ వికాస సంఘం అధ్యక్షులు భట్టు నర్సిరెడ్డి, కార్యదర్శి ఎన్టీ పంచాక్షరిలు తెలిపారు. 6న విఘ్నేశ్వర పూజ, అభిషేకాలు, సర్వదేవతా పూజలు, అభిషేకాలు, భగవద్గీత పారాయణయాలు, దేవయజ్ఞం, మహాత్ముల ప్రవచనాలు, భజనలు, 7న శివకోటి యజ్ఞం, పూర్ణాహుతి, శివగీత, భగవద్గీత, పారాయణ, ప్రవచనాలు, 8న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి 10 గంటలకు శివపార్వతుల కల్యాణం, రుద్రాభిషేకం, 9న అగ్నిగుండం, నందికోత్సవ సేవ, 10న భజనలు, చిన్నతేరు, నందీశ్వరసేవ, 11న పెద్ద తేరు, 12న చక్రతీర్థం, అమృత స్నానం, రుద్రాభిషేకం, మంగళహారతి కార్యక్రమాలుంటాయని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు రామరెడ్డి, వీరయ్య, యాదయ్య, యాదగిరి రెడ్డి, శ్రీనునాయక్, సరితపంతూనాయక్, వైద్యనాథ్, చంద్రశేఖర్‌రెడ్డిలు కోరారు.

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి


పొలాలను పరిశీలిస్తున్న గోపాల్

కులకచర్ల, మార్చి 1: రైతులు సాగు చేసే పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ వికారాబాద్ జిల్లా అధికారి గోపాల్ తెలిపారు. మండలంలోని కుసుమ సముద్రం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. పంటలను వ్యవసాయశాఖ విస్తరణ అధికారి దగ్గర ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వీరస్వామి, రైతులు పాల్గొన్నారు.

పల్లె రోడ్లకు మహర్దశ

- మండలానికి రూ.3కోట్ల ఉపాధిహామీ నిధులు
- బషీరాబాద్ పరిధిలో ముమ్మరంగా పనులు


మాసన్‌పల్లిలో సాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

బషీరాబాద్, మార్చి 1: మండలంలోని గ్రామాలు, గిరిజన తండాల అంతర్గత రోడ్లకు మహర్దశ పట్టుకుంది. ఉపాధిహామీ పథకం కింద రూ.3 కోట్ల నిధులు మంజూరు కావడంతో ఆయా గ్రామాల్లో పనులు ముమ్మరం చేశారు.పలు వార్డుల్లో అంతర్గత మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తున్నారు. గత కొన్నేళ్లుగా పల్లె ప్రజలు మట్టి రోడ్లతో రాత్రి వేళా, వర్షాకాలంలో బురదతో ఎన్నో ఇబ్బందులు పడేవారు.ఈ రోడ్ల అభివృద్ధికి బుయ్యని మనోహర్‌రెడ్డి నిధులు మంజూరు చేయించడంతో పలు గ్రామాల్లో శరవేగంగా పనులు కొనసాగుతున్నాయి. బషీరాబాద్ మేజర్ పంచాయతీకి రూ.40లక్షలు, మిగతా 35 పంచాయతీలకు గాను ఒక్కోదానికి రూ.5 నుంచి 10 లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయి.దీంతో మాసన్‌పల్లి, నీళ్లపల్లి, కంసాన్‌పల్లి(బి), బషీరాబాద్, మంతట్టి, అల్లాపూర్ తదితర గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పనులు జోరందుకున్నాయి.ఈ రోడ్లను మార్చి 15 లోపు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ఈ క్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ, ఏఈలు సీసీ రోడ్ల నిర్మాణం పనులను సకాలంలో పూర్తి చేయించేందుకు చర్యలు చేపట్టారు. రోడ్లన్నీ సీసీ రోడ్లుగా మారుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బోరు చుట్టూ మురుగు.. గ్రామస్తుల ఇక్కట్లు



చౌదరిగూడ, మార్చి 1 : ప్రత్యేకాధికారుల నిర్లక్ష్యంతో లచ్చంపేటలో తాగునీటి బోరుచుట్టూ మురుగుతో పాటు నాచుతో కప్పబడి ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దాంతో గ్రామస్తులకు ఇబ్బందిగా మారింది. కాగా, సర్పంచుల పాలన ముగిసి 2నెలలు కావస్తున్నా పారిశుధ్యంపై దృష్టి సారించడంలేదనే విమర్శలున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొనగట్టు శివాలయంలో ముగిసిన వార్షికోత్సవాలు



శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చేవెళ్ల, మార్చి 1 : మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయం వార్షికోత్సవాల చివరి రోజులో భాగంగా దేవాలయంలో శుక్రవారం శివానామస్మరణ మారుమోగింది. ఉదయం నుంచి రాత్రి వరకు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమశివుడితో పాటు రాజరాజేశ్వరి అమ్మవారికి మహిళలు వైభోవంగా కుంకుమర్చాన చేశారు. పూనమ్ పూజ, రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, అమ్మవారికి సహస్ర పుష్పార్చన, రుద్ర హోమం, పూర్ణాహుతి, మంగళహారతులు ఇచ్చారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలిరావడంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ చైర్మెన్, ధర్మకర్తలు సున్నపు వసంతం, సున్నపు మాణిక్యప్రభు, ఆలయ కమిటీ సభ్యులు, జె. మల్లేశ్, శ్రీనివాసచారి, ఆనందం, రాంరెడ్డి, పర్మయ్య, దెవేందర్, సత్యనారాయణ, మల్లారెడ్డి, భక్తులున్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్, మార్చి 1 : గాలికుంటు వ్యాధి రాకుండా రైతులు తమ పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిర్మలాపూర్, సోలిపేట్, మద్దూర్ గ్రామాల్లో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండటానికి ఈ టీకాలు తప్పకుండా వేయించాలన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఉచిత విద్యుత్ లబ్ధిదారులకు జీరో బిల్లులు



బిల్లు చూపిస్తున్న వినియోగదారుడు

షాద్‌నగర్, మార్చి : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చింది. నెలవారి విద్యుత్ బిల్లుల చెల్లింపులో భాగంగా శుక్రవారం విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు జీరో బిల్లులు అందజేశారు. గృహలక్ష్మీ పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్న వినియోగదారులకు గత నెలకు సంబంధించిన బిల్లులకు ఆ శాఖ అధికారులు జీరో బిల్లులను ఇచ్చారు.

ఫార్మాసిటీ సీఐ బదిలీ

యాచారం, మార్చి 1 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ జి.నాగరాజు నగర శివారులోని జవహర్‌నగర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కమిషనరేట్‌లో వెయిటింగ్‌లో ఉన్న పి.రాజేష్‌ను నియమిస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా నాగరాజు గ్రీన్ ఫార్మాసిటీ స్టేషన్ సీఐగా 29 రోజులు మాత్రమే విధులు నిర్వహించారు.

ఆమనగల్లు సీఐ..



విజయ్‌కుమార్

ఆమనగల్లు, మార్చి 1 : ఆమనగల్లు సీఐ జి.విజయ్‌కుమార్ శుక్రవారం బదిలీ అయ్యారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయ్‌కుమార్‌ను ఐజీ కార్యాలయానికి సరెండర్ చేశారు. ఫిబ్రవరి 21న బాధ్యతలు చేపట్టిన ఆయనను పది రోజులకే బదిలీ చేశారు. కాగా ఇంకా పోస్టింగ్ ఎవరికీ ఇవ్వలేదు.

బాధ్యతలు స్వీకరించిన 'పట్నం' సీఐ



సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం, మార్చి 1 : ఇబ్రహీంపట్నం సీఐగా బీ.సత్యనారాయణ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ సైదిరెడ్డి సరూర్‌నగర్ సీఐగా బదిలీ కాగా పహడీషరీఫ్ సీఐగా ఉన్న సత్యనారాయణ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

సేవాలాల్ సేన మండల నూతన కమిటీ ఎన్నిక

కందుకూరు, మార్చి 1 : సేవాలాల్ సేన మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్షుడు భీంలాల్, పవార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. మండల శాఖ అధ్యక్షునిగా జె.రవినాయక్, ప్రధానకార్యదర్శిగా కె.రమేష్‌నాయక్, గౌరవ అధ్యక్షునిగా బాణావత్ బాలునాయక్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా రమావత్ రవినాయక్, ప్రచార కార్యదర్శిగా ఎస్ కృష్ణానాయక్, ఉపాధ్యక్షులుగా ఆర్ శ్రీనివాస్, లోకేష్‌నాయక్, మోతీలాల్‌నాయక్, కె.రాజు, ఆర్ శంకర్‌నాయక్, కార్యదర్శులుగా వి.వినోద్‌నాయక్, బి.సామ్యనాయక్, రాంచందర్‌నాయక్ జగన్‌నాయక్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. రైతుసేన అధ్యక్షునిగా ఆర్ హట్యానాయక్, ప్రధానకార్యదర్శిగా ఎన్ సీతనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జె.రూప్లానాయక్, ఉపాధ్యక్షులుగా పి.బించిలాల్‌నాయక్, కార్యదర్శిగా వి.లచ్చునాయక్, యువసేన అధ్యక్షునిగా దేవేందర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఆర్ శ్రీకాంత్‌నాయక్, ఉపాధ్యక్షులుగా ఆర్ అమరేందర్‌నాయక్, జైపాల్‌నాయక్, దేవ్‌సింగ్‌నాయక్, సురేష్‌నాయక్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు విస్లవత్ శీనునాయక్, సేవాలాల్‌సేన జిల్లా ప్రధానకార్యదర్శి కె.రాజునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌ను నిర్వహించాలి

కేశంపేట, మార్చి 1 : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయాలంటే డీఎస్సీ కంటే ముందు టెట్‌ను నిర్వహించాలని బీజేపీ యువమోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు శివాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన వారు చాలా మంది టెట్‌కు అర్హత సాధించాలేదని, వారి కోసం ప్రభుత్వం టెట్ ను నిర్వహించాలని కోరారు. టెట్‌ను నిర్వహిస్తే మరి కొంతమంది డీఎస్సీ రాయడానికి అర్హత సాధిస్తారని ఆయన చెప్పారు.

ధరణి సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

- రెండు బృందాల ఏర్పాటు
- ఈనెల తొమ్మిది వరకు నిర్వహణ



తహసీల్దార్ టి. అయ్యప్ప

యాచారం, మార్చి 1 : మండలంలోని వివిధ గ్రామాల్లో ధరణి సమస్యల పరిష్కారం కోసం శనివారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దారు టీ.అయ్యప్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని భూ సమస్యల పరిష్కారానికి రెండు బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 24 రెవెన్యూ గ్రామాల్లో 2,629 భూ సమస్యలున్నట్లు గుర్తించామన్నారు. ప్రతి గ్రామం నుంచి బాధిత రైతుల భూముల రికార్డులు తెప్పించి వాటిని తక్షణమే పరిష్కరించబోతున్నట్లు చెప్పారు. తహసీల్దారు, సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూఇన్‌స్పెక్టర్, వ్యవసాయాధికారితో ఓ బృందం, డిప్యూటీ తహసీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శితో మరో బృందం ఏర్పాటు చేశామని తెలిపారు. చాలా కాలంగా పరిష్కారం కాకుండా ఉన్న భూ సమస్యలను తీర్చడం కోసమే ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు అయ్యప్ప చెప్పారు. మండలంలో ఏ ఒక్క గ్రామంలో భూ తగాదాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు కీర్తి సాగర్, ఆర్‌ఐలు సుజిత్ రెడ్డి, రామకృష్ణ తదితరులున్నారు.

గడువు పెంచాలి



జంగారెడ్డి

కందుకూరు : ధరణి సమస్యలపైన రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9వరకు చేపట్టనున్న స్పెషల్ డ్రైవ్ గడువును పెంచాలని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా మండలంలోని వివిధ గ్రామాల రైతులు ధరణి సమస్యలపై పెట్టుకున్న దరఖాస్తులు 4వేలకు పైగా ఉన్నాయన్నారు. అవన్నీ తొమ్మిది రోజుల్లో ఎలా పరిష్కారం అవుతాయని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన తొమ్మిది రోజుల గడువులో మూడు రోజులు సెలవులే ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యే వరకు గడువును పెంచాలని, లేందంటే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికేనని రైతులు భావిస్తారని ఆరోపించారు.

ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్

ఆమనగల్లు , మార్చి 1 : ఐదేళ్లలోపు చిన్నారులకు వారి తల్లిదండ్రులు విధిగా పోలియో చుక్కలు వేయించాలని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ పరీక్షిత్ నరేంద్ర తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో వందశాతం పల్స్‌పోలియోకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. రేపటి (3వతేదీ) నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే పల్స్‌పోలియో వివరాలను శుక్రవారం ఆయన వివరించారు. పోలియో చుక్కలు వేయడానికి 32 బూత్‌లను ఏర్పాటు చేశామని, నిర్వాహణకు నలుగురు సూపర్‌వైజర్లు, 128 మంది సిబ్బందిని నియమించామని చెప్పారు. రేపు అన్ని కేంద్రాలలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, 4న మిగిలిపోయిన వారికి ఇంటింటికీ తిరిగి చుక్కలు వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

మాడ్గుల : మండలంలోని 5 సంవ్సరాల లోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని మాడ్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ మోహన్ అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాక్సినేటర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3న జరిగే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులు పోలియో బారిన పడకుండా చక్కలు తప్పక వేయించాలని ఆయన చెప్పారు. కోళ్లఫారాలు, ఇటుక బట్టీలలో పని చేసే వారి పిల్లలను గుర్తించి వారికి కూడా పోలియో చుక్కలు వేయటానికి మొబైల్ వెహికిల్ ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవితం

తలకొండపల్లి, మార్చి 1 : ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగే వారు ఆనందమయ జీవితాన్ని పొందుతారని, మానవాళి సన్మార్గంలో నడపడానికి, దైవ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామ సమీపంలోని శ్రీ మల్లప్ప గుట్ల మల్లికార్జున స్వామి దేవాలయం ఆవరణలో నూతనంగా నిర్మించే సాక్షి గణపతి ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఆలయ నిర్వాహకులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 6 నుంచి 9 వరకు మల్లప్ప గుట్టపై జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. దామోదర్‌రెడ్డి, పెంటారెడ్డి, మల్లారెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి, అనితారెడ్డి, తదితరులు

షాబాద్, మార్చి 1 : దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజేందర్‌రెడ్డి 36వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని పీఆర్ఆర్ కళాశాల, ముద్దెంగూడ, గొల్లూర్‌గూడ గ్రామాల్లో ఆయన విగ్రహాలకు జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతితో కలిసి మహేందర్‌రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పీఆర్ఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాజేందర్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతికి ఎంతో కృషి చేశాడన్నారు. చందన్‌వెల్లి, సీతారాంపూర్ పరిశ్రమల హబ్‌గా మారుతాయని, దాంతో యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు.

క్రీడల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు

వారం రోజులుగా పట్నం రాజేందర్‌రెడ్డి స్మారకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్, వాలీబాల్, క్యారం పోటీల్లో గెలుపొందిన జట్లకు వారు బహుమతులు అందజేశారు. క్రికెట్‌లో మొదటి స్థానంలో నిలిచిన చందన్‌వెల్లి టీంకు రూ.75 వేల నగదు, మెమెంటో, రన్నర్‌గా నిలిచిన మస్‌కతీ టీంకు రూ.50వేల నగదు, మెమెంటోను అందజేశారు. వాలీబాల్ విన్నర్ అంతారం టీంకు రూ. 25 వేలు, కుమ్మరిగూడ రన్నర్‌టీంకు రూ. 15 వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావ్, మాజీ జడ్పీటీసీ కోట్ల మహేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీరాంరెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదల హృదయాల్లో నిలిచిన నేత

చేవెళ్ల : పేదల హృదయాల్లో నిలిచిన నేత దివంగత రాజేందర్‌రెడ్డి అని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజేందర్‌రెడ్డి 36వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి వారు, జడ్పీ చైర్మన్ అనితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, టీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు అవినాష్‌రెడ్డిలు పూలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పేరిట సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, యాదగిరి, ఆగిరెడ్డి, శ్రీనివాస్, రమేశ్వర్ రెడ్డి, నరేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, కృష్ణ, మాణిక్యరెడ్డి, రవీందర్, చందు, ప్రసాద్, రాజు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యం, ఓటు విలువపై అవగాహన

- ఫరూఖ్‌నగర్ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్



ఇబ్రహీంపట్నం : ఓటు వేస్తున్న విద్యార్థిని

షాద్‌నగర్, మార్చి 1 : ప్రజాస్వామ్యం, ఓటు విలువ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకు ఫరూఖ్‌నగర్‌లో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపధ్యాయురాలు పద్మశ్రీ శైలజ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, ఎన్నికలు, ఓటు హక్కు గురించి విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకే ఈ నమూనా ఎన్నికలను నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, ఓటు హక్కు వినియోగించుకునే విధానం, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తదితర విషయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామని చెప్పారు.

పొల్కంపల్లి ప్రభుత్వ పాఠశాలలో..

ఇబ్రహీంపట్నం : పొల్కంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ పాఠశాలలో నిర్వహించిన మాక్‌పోలింగ్ నుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు పారదర్శకంగా జరగాలని, ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని చెప్పారు. నామినేషన్లు దాఖలు చేయడం, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటింగ్, ఓట్ల లెక్కింపు, గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాలపై విద్యార్థులకు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులే ఓటర్లు, ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

తలకొండపల్లి, మార్చి 1 : తలకొండపల్లి మండల కేంద్రంలో నూతన ఆధార్ కేంద్రాన్ని స్థానిక పాఠశాలలో శుక్రవారం ఎంపీటీసీ హేమ రాజు, మాజీ ఉపసర్పంచ్ పద్మఅనిల్ ప్రారంభించారు. ఆధార్ కేంద్రం లేక ఏళ్ల తరబడి మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల ఒత్తిడి మేరకు ప్రభుత్వం ఆధార్ కేంద్రాన్ని మంజూరు చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు శశికళ, నాయకులు శేఖర్‌యాదవ్, పద్మ విఠల్, తిరుపతయ్య, ఆంజనేయులు, ప్రసాద్, యాదయ్య, జంగయ్య, సురేశ్, సాయిరామ్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే కక్ష సాధింపు

- మంచాల పీఏసీఎస్ చైర్మన్ బుస్సుపుల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బుస్సుపుల్లారెడ్డి

మంచాల, మార్చి 1 : రాజకీయ దురుద్దేశంతోనే తనపై కాంగ్రెస్ నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మంచాల పీఏసీఎస్ చైర్మన్ బుస్సుపుల్లారెడ్డి ఆరోపించారు. శుక్రవారం మంచాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ జాటోత్‌నర్మదలచ్చిరాం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చీరాల రమేష్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ మంచాల పీఏసీఎస్ ఎన్నికల్లో గెలిచిన సహచర మెజారిటీ డైరెక్టర్ల మద్దతుతో నాలుగేళ్లుగా తాను చైర్మన్ పదవిలో కొనసాగుతున్నానని చెప్పారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని కాంగ్రెస్‌కు చెందిన విపక్ష డైరెక్టర్లు తనపై కుట్రపూరితంగా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పీఏసీఎస్ నూతన భవన నిర్మాణం, ధాన్యం కొనుగోళ్లు, పాలనాపరమైన నిర్వహణ వ్యయంలోనూ చట్టబద్ధంగానే నిధుల వినియోగం అంతా సహకార సంఘ డైరెక్టర్లు, సిబ్బంది పర్యవేక్షణలోనే జరిగిందని తెలిపారు. ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే విచారణకు ఆదేశించినట్లు చెప్పారు. ఇందులో వివరణ ఇచ్చానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రాజకీయ ఒత్తిడితో తనపై డిస్‌క్వాలీపై ఉత్తర్వులు తీసుకువచ్చారని తెలిపారు. ఆ ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించి స్టే పొందానని చెప్పారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రైతుల మద్దతు ఉన్నంత కాలం తాను పదవిలో కొనసాగుతానని స్పష్టం చేశారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ సత్యనారాయణ, ఎంపీటీసీ సుకన్య, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, కె.రాంరెడ్డి, జంగారెడ్డి, బద్రీనాథ్‌గుప్త, చిదం రఘుపతి, మహేందర్‌రెడ్డి, పున్నం రాము, గంట విజయ్, కృష్ణ, రావుల శంకర్, మహేందర్‌రెడ్డి, రఘుపతి, ఆకారం కృష్ణ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కొందుర్గు, మార్చి, 1 : మండల పరిధిలోని రాంచంద్రాపూర్ చౌరస్తాలో మాజీ ఎంపీటీసీ బి.మధుసూదన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బి.రవీందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీఆర్ఎస్ నాయకుడు వై మురళీయాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల రవీందర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పి గోపాల్, నటరాజ్, ఎం.నారాయణ యాదవ్, రవియాదవ్, రాంచంద్రయ్య, శేఖర్, బి రాములు, రాజ్‌కుమార్, సురేష్, సాయిరెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన



మాట్లాడుతున్న రవీందర్ నాయక్

ఆమనగల్లు, మార్చి 1 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా రంజక పాలన అందిస్తోందని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు రవీందర్ నాయక్ అన్నారు. ఎన్నికలకు ముందుకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని చెప్పారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండడం హర్షదాయకమన్నారు. భూ సమస్యలతో రైతుల ఇబ్బందులు పడకూడదన్నదే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టుల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయని చెప్పారు. ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజాపాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పేదల వైద్యచికిత్సలకు రూ.10 లక్షలు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పత్యానాయక్, లక్ష్మణ్, ఉన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

మహేశ్వరం, ఫిబ్రవరి 1 : మండల పరిధిలోని ఎన్డీ తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభం, శిఖర విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా ముగిశాయి. వివిధ పార్టీల ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ రాజునాయక్, గోపాల్‌నాయక్, జాంప్లానాయక్, రవినాయక్, కుండె వెంకటేష్, సేవ్యానాయక్, ఘాంసీరామ్‌నాయక్, ఆనంద్‌నాయక్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాల సీజ్



వాహనాలను సీజ్ చేస్తున్న ఎస్సై

కడ్తాల్, మార్చి 1 : మండలంలోని ముద్విన్ గ్రామంలో అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తరలిస్తున్న మూడు వాహనాలను శుక్రవారం కడ్తాల్ పోలీసులు పట్టుకున్నారు. ముద్విన్ గ్రామ సమీపంలో అక్రమంగా ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నట్లు సమాచారమందుకున్న ఎస్సై వరప్రసాద్ తన సిబ్బందితో తనిఖీ చేపట్టారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్, ట్రాక్టర్, జేసీబీలను సీజ్ చేశామని ఎస్సై చెప్పారు. ఫిల్టర్ ఇసుక తరలిస్తున్న వాహనాల యజమాని రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో డాక్టర్ మృతి



మృతుడు

షాద్‌నగర్‌రూరల్, మార్చి 1 : షాద్‌నగర్ పట్టణంలోని నాగులపల్లి రోడ్డులో ఓ డాక్టర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం హైదరాబాద్ మారేడుపల్లికి చెందిన డాక్టర్ జాన్ ఫేజర్(50) చటాన్‌పల్లిలో గల విల్‌హెల్ క్రిస్టియన్ ఆస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం 8.00 గంటల సమయంలో షాద్‌నగర్‌లో బస్సు దిగి నాగులపల్లి రోడ్డు వైపు వెళ్లాడు. నడుచుకుంటూ వెళుతుండగానే రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య హావేలాఫేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాంచంద్రయ్య తెలిపారు.

దేవాలయ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి

- తహసీల్దారు, కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మంచాల, మార్చి 1 : దేవాదాయ శాఖకు చెందిన భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలంటూ ఆరుట్ల గ్రామానికి చెందిన అఖిలపక్ష నేతలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం మంచాల తహసీల్దారు, జిల్లా కలెక్టర్‌కు సమస్యను విన్నవించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ చీరాల రమేష్, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, పాండాల జంగయ్య, కె.భాస్కర్, గుడ్డిమల్ల చంద్రయ్య, మాసయ్య, చీమల జంగయ్యయాదవ్‌లు మాట్లాడుతూ ఆరుట్ల సర్వే నెం.1581, 1582లో దేవాదాయశాఖకు 12.12 ఎకరాల భూమి ఉన్నదని తెలిపారు. ఇట్టి భూమిని పలువురు పూజారులు, దళారులు అక్రమ మార్గంలో తప్పుడు పత్రాలు సృష్టించి కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వారిని పిలిపించి తప్పుడు పనులు చేయొద్దని చెప్పినా వినకుండా దేవుడి భూమిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. భూమిపై సమగ్ర విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వంగాల కృష్ణ, మధుసూదన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమంగా సరఫరా చేస్తే పీడీ యాక్ట్



తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటి

మాడ్గుల, మార్చి 1 : ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాని అక్రమంగా సరఫరా చేసే వారిపై, మిల్లర్లపై పీడీ యాక్ట్ నమోదు చేయటం జరుగుతుందని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. మండలంలోని ఇర్విన్ గ్రామంలో మల్లికార్జున రైస్‌మిల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ పలువురు రేషన్ బియ్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాటిని నూకలుగా మార్చి గుట్టు చప్పుడు కాకుండా పలువురు దందా కొనసాగిస్తున్నారని తెలిపారు. అలా చేసే మిల్లులకు తాళం వేయటం ఖాయమని, వారిని జైలుకు పంపటం ఖాయమని హెచ్చరించారు.

వర్గీకరణ సాధించినపుడే అమరుల ఆత్మశాంతి

షాద్‌నగర్, మార్చి1 : ఎస్సీ వర్గీకరణ సాధించినపుడే మాదిగ అమరవీరుల ఆత్మ శాంతిస్తుందని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహా అన్నారు. శుక్రవారం పట్టణ ప్రధాన కూడలిలో మాదిగ అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతి అస్థిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ప్రాణాలర్పించిన అమరవీరులు ఎల్లప్పుడూ మాదిగ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని అన్నారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలు అభివృద్ధి చెందుతారని చెప్పారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పెంటనోళ్ల రవీందర్‌మాదిగ, బుర్ర రామచంద్రయ్య, కొంకర లక్ష్మయ్య పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వసతులు కల్పించాలి

యాచారం, మార్చి 1 : స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు తగిన వసతులు కల్పించాలని సీపీఎం యాచారం మండల నాయకులు ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరారు. శుక్రవారం సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహా నాయకులు అంజయ్య, చందూనాయక్ తదితరులు బస్టాండ్‌ను సందర్శించి ప్రయాణికుల ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు ముదురుతున్నందున తాగు నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. మూత్రశాల, మరుగుదొడ్లకు నీటివసతి కల్పించడంపై అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. బస్టాండ్ ఆవరణలో సీసీ రోడ్డు వేయడం కోసం మండలాధికారులు చొరవ చూపాలని కోరారు.

ప్రణాళికా సంఘం బోర్డు ఉపాధ్యక్షుడికి సన్మానం

కొందుర్గు, మార్చి, 1 : తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం బోర్డు ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డిని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మెన్ సయ్యద్ సాధిక్, మిత్ర బృందం శుక్రవారం హైదారాబాద్‌లో కలిసి శాలువా, బోకేతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కేబినెట్ హోదాలో చిన్నారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో నవాజ్ గోరి, ఖాదర్ గోరి ఉన్నారు.

చిన్నారెడ్డి నియామకం హర్షణీయం

షాద్‌నగర్, మార్చి 1 : ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియామకమైన మాజీ మంత్రి చిన్నారెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయంగా ఎంతో అనుభవం గల వ్యక్తిని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

షాబాద్, మార్చి 1 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మోడల్‌స్కూల్ ఉన్నత పాఠశాలలో ని 567 మంది విద్యార్థులకు ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్షప్యాడ్స్, జామెట్రీబాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు స్టేషనరీ అందించిన ట్రస్ట్ వారికి ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ఎలుగంటి అభిరామ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచులు రవీందర్‌నాయక్, జనార్ధన్‌రెడ్డి, నాయకులు రాహుల్‌గుప్తా, సుభాష్‌రెడ్డి, గౌరీశ్వర్, శేఖర్, తౌఫీక్, హరికృష్ణ, రాఘవేందర్, సంజు, మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.